కరువు నేలలో సిరుల సాగు



గాలివీడు ప్రాంతంలో సాగవుతున్న టమాట



వంకాయ పంట వేసిన రైతు



సాగులో ఉన్న మిరప పంట

- కూరగాయల పంటల వైపు ఆసక్తి చూపుతున్న రైతులు
- జిల్లాలో 18 వేల హెక్టార్లలో వివిధ రకాల కూరగాయల పంటలు
- మార్కెట్‌లో ధరల నిలకడతో రైతన్నల హర్షం

గాలివీడు : నిత్యావసరాలలో ఒకటైన కూరగాయల ధరలు మార్కెట్‌లో నిలకడగా ఉండడంతో చాలా మంది రైతులు ప్రస్తుతం వాటి సాగుపై దృష్టి సారించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల కూరగాయల పంటలతోపాటు దోస, పూలతోటలు, కూరగాయల పంటలను 18 వేల హెక్టార్లలో సాగు చేస్తున్నారు. ఇందులో అత్యధికంగా టమాట, వంకాయ, బీర, కాకర, చిక్కుడు, అనప, పచ్చిమిర్చి, క్యాబేజీ తదితర రకాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 18 వేల హెక్టార్లలో కూరగాయలు, ఆకుకూరలు తదితర పంటలను రైతన్నలు సాగు చేశారు. వీటిలో అత్యధికంగా దాదాపు 8000 హెక్టార్లలో టమాట సాగు ఉంది. 400 హెక్టార్లలో వంకాయ, మరో 400 హెక్టార్లలో పచ్చిమిర్చి పంటలు సాగులో ఉన్నాయి. 200 హెక్టార్లలో వివిధ రకాల కూరగాయలను రైతులు సాగు చేశారు.

నిలకడగా ధరలు

తరుచూ కూరగాయల ధరలు ఎక్కువగా దిగుబడి రావడంతో రైతులకు నష్టాలు లేకుండా లాభాలు వచ్చాయి. అయితే ఈనెలలో రోజుల తరబడి ధరలు నిలకడగా ఉండడంతో పలువురు రైతులు సాగు చేసిన కూరగాయలకు గిట్టుబాటు ధర లభ్యమవుతోంది. దీంతో రైతన్నలు ఎక్కువగా కూరగాయల పంటలపైనే దృష్టి సారిస్తున్నారు. ప్రభుత్వం సబ్సిడీ కింద కూరగాయల విత్తనాలను అందిస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నారు.

మార్కెట్ సౌకర్యం లేక ఇబ్బందులు

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రైతులు పండించిన ఉత్పత్తులకు సరైన మార్కెట్ సదుపాయం లేదు. దీంతో చాలామంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మదనపల్లె, బాగేపల్లె, చెన్నై, బెంగుళూరు, అనంతపురం తదితర మార్కెట్లకు కూరగాయలను తరలిస్తున్నారు. స్థానికంగా జిల్లా కేంద్రంలో రైతుల కోసం మార్కెట్ సదుపాయాన్ని కల్పిస్తే రైతుల కష్టాలు దూరమవుతాయంటున్నారు.



లాభాలు చూస్తున్నాం

నేను మూడు ఎకరాలలో టమాటాను సాగు చేశాను. ప్రస్తుతం ధరలు నిలకడగా ఉండడంతో ఖర్చులు పోను ఎకరాకు రూ. 1.50 లక్షల వరకు ఆదాయం చేకూరింది. కూరగాయల పంటలతోనే అధిక లాభాలు వస్తున్నాయి.

– రెడ్డికుమార్, రైతు, అరవీడు, గాలివీడు మండలం

మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి



జిల్లాలో వారంతపు సంతలు తప్ప పెద్ద మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో సాగు చేసిన కూరగాయలను ఇతర మార్కెట్లకు తరలించాల్సి వస్తోంది. ఇది చాలా ఖర్చుతోపాటు అధికశ్రమతో కూడుకున్న విషయం. అంతదూరం సరుకు తీసుకువెళ్లినా దళారులు ఎంత చెబితే అంతకు ఇవ్వాల్సి వస్తోంది. ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే మరింత మంది కూరగాయల సాగు చేస్తారు.

– వెంకటాద్రి, రైతు, గోరాన్‌చెరువు, గాలివీడు మండలం

క్లుప్తంగా

ఉప్పరపల్లిలో పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులు చేపడుతున్న దృశ్యం

సిద్దవటం (ఒంటిమిట్ట) : సిద్దవటం మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో పలుచోట్ల ఆదివారి పారిశుద్ధ్య పనులు వేగవంతంగా చేపట్టారు. హాస్టల్ వీధి, రామస్వామి గుడి, పాత సచివాలయం పలు ప్రాంతాలలో పనులు చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మనోహర్ ఆదివారం మాట్లాడుతూ పంచాయతీలో వర్షాలు కారణంగా ఉన్న అపరిశుభ్రత ప్రాంతాలను, ముళ్ల పొదలను పూర్తిగా తొలగిస్తామని, పారిశుద్ధ్య పనులు మూడురోజుల పాటు కొనసాగుతాయన్నారు. అపరిశుభ్రత తొలగించిన ప్రదేశంలో బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రామాపురంలో..

రామాపురం : మండల పరిధిలోని రాచపల్లె పంచాయతీ బీదంవాండ్లపల్లెలో ఆదివారం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. గ్రామ ప్రజలకు పరిశుభ్రతను పాటించడమేకాక పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కిషోర్ నాయుడు పేర్కొన్నారు.

వంతెనను ఏర్పాటు చేయాలి

రామాపురం : మండల పరిధిలోని కసిరెడ్డిగారి పల్లెకు వెళ్లే దారిలో వర్షపు నీరు వచ్చి బ్రిడ్జి కొట్టుకుపోయిందని ఆ గ్రామానికి చెందిన నాయకుడు ధనుంజయ, నాగరాజులు తెలిపారు. గ్రామం నుంచి జాతీయ రహదారిపైకి వెళ్లాలంటే రోడ్డు ఇరువైపుల బాగా దెబ్బతిందన్నారు. దీంతో ఎప్పుడు ఎక్కడ ఏ గుంతలో పడతామోనని వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. వెంటనే రోడ్డుకు వంతెన ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ మహాసభలను జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

చిట్వేలి : ఎస్‌ఎఫ్‌ఐ మహాసభలను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు లతీఫ్, దివిన్‌లు కోరారు. ఆదివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో అన్నమయ్య జిల్లా మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ అన్నమయ్య జిల్లా మహాసభను ఈనెల 21, 22వ తేదీలలో మదనపల్లిలో నిర్వహించబోతున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల నాయకులు ఆదర్శ్, రూప, మల్లిక, సంజన, రూపేస్, సంతోష్, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల అడ్డగింత



అక్రమ కట్టడాన్ని అడ్డుకుంటున్న వీఆర్‌ఓ రజని

సిద్దవటం (ఒంటిమిట్ట) : సిద్దవటం మండలంలోని పెద్దపల్లి రెవెన్యూ మాధవరం గ్రామం కడప – చెన్నై జాతీయ రహదారి గ్రామ సచివాలయం–2 పక్కన ప్రభుత్వ స్థలం సర్వే నెంబరు. 864/7లో అక్రమంగా గృహ నిర్మాణం, కట్టడాలు పనులు చేస్తుండగా రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వీఆర్‌ఓ రజని మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో ఎటువంటి కట్టడాలు చేయకూడదని గత కొద్ది రోజులు కిందట పనులు చేస్తుండగా నిలుపుదల చేశామని, ప్రభుత్వ కార్యాలయాలు సెలవుదినంలో పనులు చేస్తున్నట్లు గ్రామస్తుల నుంచి ఫిర్యాదు రావడంతో అడ్డుకున్నామని చెప్పారు. నిర్మాణం చేపడుతున్న గృహ నిర్వాహకుడిను సంబంధిత పత్రాలు మండల తహసీల్దార్ కార్యాలయానికి తీసుకురమ్మని ఆదేశించి నిర్మాణ పనులు నిలుపుదల చేశామన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఏ వెంకటసుబ్బయ్య, వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

కేసులను సామరస్యంగా పరిష్కరించుకోవాలి



విచారణ చేస్తున్న పోలీసులు

సుండుపల్లె : మండల పరిధిలోని జి.రెడ్డివారిపల్లి, గుండ్లపల్లి, పింఛాతోపాటు పలు గ్రామాలలో ఆదివారం పోలీసులు పర్యటించి లోక్ అదాలత్ కేసులు విషయంలో విచారణ చేపట్టారు. లోక్ అదాలత్ అనేది కోర్టుల వెలుపల వివాదాలను సామరస్యంగా కేసులను పరిష్కరించుకోవడం ఉద్దేశించబడిందని కోర్టు కానిస్టేబుల్ ఈశ్వర్ తెలిపారు. ఇందులో ఆస్తి అభ్యర్థన, ఆర్థిక వివాదాలు, వైవాహిక సమస్యలు వంటి కుటుంబ వివాదాలను లోక్ అదాలత్ ద్వారా సమర్థవంతంగా పరిష్కరించబడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ ప్రవీణ్ పాల్గొన్నారు.

దారిపొడువునా అపూర్వ స్వాగతాలు



ఆకేపాటిని సత్కరిస్తున్న కొరముట్ల, ఎమ్మెల్సీ ఎంవీఆర్



పట్టణంలో స్వాగతం పలుకుతున్న నాయకులు, భక్తులు



పాదయాత్రలో ఆకేపాటితో కలిసి నడుస్తున్న రామసుబ్బారెడ్డి

రైల్వేకోడూరు అర్బన్ : రాజంపేట ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి చేస్తున్న 22వ తిరుమల మహాపాదయాత్రకు రైల్వేకోడూరులోని అనంతరాజుపేట నుంచి జిల్లా సరిహద్దు బాల్‌పల్లి వరకు భక్తులు, పార్టీ నాయకులు ఆదివారం బ్రహ్మరథం పట్టారు. దారిపొడవునా హారతులు, పూలవర్షంతో స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు లక్ష్మిగారిపల్లి వద్ద ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్సీ పొన్నపోలు (గుండ్లకుంట) రామసుబ్బారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, ఇతర నాయకులు ఆకేపాటితోపాటు పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ ఎంతో మహత్యం కలిగిన కలియుగ దైవం తిరుమల వేంటేశ్వరస్వామి సన్నిధికి 22వ సారి పాదయాత్ర చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండి, రైతులు, ప్రజలు సుఖశాంతులతో ఉండాలని అలాగే వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కలియుగ దైవం ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నట్లు తెలియజేశారు. తిరుమలకు అన్నమయ్య కాలిబాట మూడవ రోడ్డుగా ప్రభుత్వం అభివృద్ధి చేయాలని టీటీడీ అధికారులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, పంజం సుకుమార్‌రెడ్డి, ఏపీఎండీసీ మాజీ ఎండీ వెంకటరెడ్డి, రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర, అంబటి మురళి, ఆర్‌వీ రమణ, సిద్దయ్య, హరికృష్ణారెడ్డి, గునిశెట్టి రమేష్, చొప్పా రమణారెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, శంకరయ్య, చెవ్వు శ్రీనివాసులురెడ్డి, మలిశెట్టి వెంకటరమణ, బండారుమల్లి, చంద్రమోహన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు విశేష పూజలు



సంబేపల్లె: అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

లక్కిరెడ్డిపల్లి : అనంతపురం గంగమ్మ దేవతకు ఆదివారం వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి, తలనీలాలు అర్పించారు. ఆదివారం అమ్మవారి దర్శనానికి భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిక్కిరిసింది. ఆలయ పూజారులైన చెల్లు వంశీయులు గంగయ్య, సాయి, గంగాధర్, రవీలు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

నల్ల గంగమ్మ ఆలయంలో..

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వేపాకులతో ఆలయాన్ని శుద్ధి చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయంలోని బీజాక్షరాలతో కొలువైన మహిమగల రాయిపై భక్తులు పొర్లుదండాలు పెట్టారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

మల్లూరమ్మ ఆలయంలో..

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యా నది వద్ద కొలువై ఉన్న శ్రీ మల్లూరమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారిని విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. మొక్కుబడులు తీరిన వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు.

మూగజీవాలతో ట్రాఫిక్ కష్టాలు

- పట్టణంలో రోడ్లపైనే ఆవుల మందలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



ప్రధాన రహదారిపై ఆవుల మంద

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలో ఆవులు రోజురోజుకూ అధికమై ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. తిరుపతి కడప ప్రధాన రహదారి రోడ్లపైన ఎక్కడపడితే అక్కడ ఆవులు పదుల సంఖ్యలో తిష్టవేసి వాహన చోధకులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనివల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగడమే కాకుండా ప్రతిరోజు ప్రమాదాలు జరుగుతున్నాయి. రైల్వేకోడూరులో ఆవుల యజమానులు ఇళ్ల వద్ద వాటిని సంరక్షించుకోకుండా నిర్లక్ష్యంగా మూగజీవాలను రోడ్లపైకి వదిలేస్తుంటారు. భారీ వాహనాలు తిరగడం వల్ల పలు గోవులు ప్రమాదానికి గురవుతున్నాయి. ప్రధాన రహదారిలో డివైడర్‌కు ఇరువైపులా రోడ్డు వెడల్పు తక్కువగా ఉండటం అలాగే చిరువ్యాపారులు, ఆటోలు, బస్సులు ఎక్కడపడితే అక్కడ ఆపివేయడం ట్రాఫిక్ తిప్పలు ఉంటుంటే దీనికి తోడు ఆవులు రోడ్ల ఉంటుండటంతో ట్రాఫిక్‌ను జఠిలం చేస్తున్నాయి. రైల్వేకోడూరుకు బైపాస్‌రోడ్డు లేకపోవడంతో భారీ వాహనాలు తిరుపతి వైపు, కడప వైపు ఈ దారిలోనే వెళుతుంటాయి. ముఖ్యంగా ఎన్‌టీఆర్ సర్కిల్ వద్ద ఉదయం పూట ఆవుల బెడద ఎక్కువగా ఉంది. అలాగే మార్కెట్‌రోడ్డు వద్ద, టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్ సమస్యలతో ద్విచక్రవాహనదారులు, నడిచివెళ్లే వారు ఇక్కట్లకు గురవుతున్నారు. రైల్వేకోడూరు పోలీసులు, పంచాయతీ అధికారులు పలుమార్లు హెచ్చరించినా ప్రయోజనం కన్పించడం లేదు. పట్టణంలో రోడ్లపై ఉంటున్న ఆవులను తరలిస్తే ట్రాఫిక్ సమస్యకు కొంతవరకైనా పరిష్కారం చూపినట్టు అవుతుందని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు రామాపురానికి మంత్రి రాక

రామాపురం : మండల కేంద్రంలో సోమవారం నిర్వహించే ప్రజాదర్బార్ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్రెడ్డి హాజరవుతున్నట్లు ఎంపీడీఓ జాషువా తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండల ప్రజలు సమస్యలు ఉన్నవారు అర్జీలను మంత్రికి అందజేయవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశానికి మండలానికి చెందిన అన్ని శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో హాజరుకావాలని తెలియజేశారు.

డిసెంబర్ 14న నీటి సంఘం ఎన్నికలు

సుండుపల్లె : ఈనెల 14వ తేదీన నీటి సంఘం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు జలవనరులశాఖ ఏఈ నాగేంద్ర నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పింఛా ప్రాజెక్టు, కృష్ణారెడ్డి చెరువు, గూనేటి వాగు చెరువు, ఈట చెరువు, నారాయణరెడ్డి చెరువులకు ఎన్నికలు నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రతి రైతు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

సుండుపల్లె : మండల కేంద్రంలోని ఆరెమ్మ దేవాలయం వద్ద మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు యర్రపురెడ్డి ఆరంరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతికి చెందిన అరవింద్ కంటి ఆస్పత్రి వైద్యులు ఈ శిబిరంలో కంటి పరీక్షలను ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహిస్తారని, శస్త్రచికిత్సలు అవసరం ఉన్నవారిని అరవింద్ కంటి ఆసుపత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు చేయించి తిరిగి ఇళ్లకు చేర్చనున్నట్లు వారు తెలిపారు. కావున మండలంలోని ప్రజలందరూ ఈ ఉచిత కంటివైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోస్టుల భర్తీని పారదర్శకంగా చేపట్టాలి



మాట్లాడుతున్న అంగన్‌వాడీ నాయకురాళ్లు

రాయచోటి అర్బన్ : జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీని పారదర్శకంగా చేపట్టాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాయచోటి ప్రాజెక్టు నాయకురాళ్లు భాగ్యలక్ష్మి, సిద్దమ్మ, అనసూయమ్మ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ చిత్రపటం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రాజెక్టు పరిధిలోని వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్ల పోస్టుల భర్తీలో పారదర్శకత పాటించడం లేదన్నారు. కొంతమంది వర్కర్స్, హెల్పర్లు రెండేళ్ల నుంచి విధులను నిర్వర్తించకపోయినా కొందరు అధికారులు లోపాయికారి ఒప్పందంతో వారి పోస్టులను ఖాళీ చూపించకుండా, నోటిఫికేషన్‌లో రానివ్వకుండా జాగ్రత్తపడుతున్నారంటూ ఆరోపించారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని అవినీతి అధికారులతోపాటు దీర్ఘకాలికంగా విధులకు డుమ్మా కొడుతున్న వర్కర్ల మీద చర్యలు తీసుకోవాలంటూ వారు డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే ప్రభుత్వం భర్తీచేయక పోతుండటంతో విధుల్లోని వర్కర్లపై పనిభారం అధికమై అనారోగ్యం పాలవుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సంబేపల్లె మండలం శెట్టిపల్లె సెక్టార్‌లోని దిగువరాజువారిపల్లె అంగన్‌వాడీ కేంద్రం హెల్పర్ రెండేళ్లుగా విధుల్లో లేదని, వెంటనే కేంద్రానికి హెల్పర్‌ను కేటాయించి వర్కర్‌కు పని భారం నుంచి ఉపశమనం కలిగించాలంటూ కోరారు. సమావేశంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు సుమలత, లక్ష్మీదేవిలు పాల్గొన్నారు.

మంచు కురిసే.. మనసు మురిసే..

రాజంపేట పట్టణంలో ఉదయం వేళల్లో కురుస్తున్న మంచు ఊటీ అందాలను తలపిస్తోంది. మంచు చూపరులను ఎంతో ఆకట్టుకోవడంతోపాటు మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తోంది. దట్టంగా కురుస్తున్న మంచుతో ఎటుచూసినా ప్రకృతి అందాలు విరబూస్తున్నాయి. మంచువల్ల వాహనదారులు కాస్త ఇబ్బంది పడుతున్నా ప్రకృతి ప్రేమికులు మాత్రం మంచు అందాలను ఆస్వాదిస్తున్నారు. అంతేకాక మంచు అందాలు హాయిగొలిపిస్తున్నాయి.

– రాజంపేట టౌన్



రాజంపేట రైల్వేస్టేషన్‌లో సిగ్నల్స్‌ను కప్పేసిన మంచు

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాయచోటి (జగదాంబసెంటర్) : ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీసీఎస్‌ఎస్ ప్రాజెక్టు మేనేజర్ టి.స్వాతి అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణం గాలివీడు రోడ్డులోని గ్రూప్స్ థియేటర్ వద్ద వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది.. ఎలా వ్యాపించదు.. ఎయిడ్స్ వ్యాధి రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం బి.నాగరాణి, ఓఆర్‌డబ్ల్యూఎస్‌లు అంజమ్మ, సుహాసిని, లక్ష్మీదేవి, రాజు స్కూల్ హెడ్‌మాస్టర్ ఎస్.రమేష్‌రెడ్డి, కో–ఆర్డినేటర్ ఎల్.రెడ్డయ్య, మౌనిక, రాగలిఖిత, ఉపాధ్యాయులు, పీసీఎస్‌ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

శాశ్వత డీలర్ల ఎంపికకు సన్నాహాలు



వైఖోమ్ నైదియాదేవి, సబ్‌కలెక్టర్

రాజంపేట : రాజంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని 9 మండలాల్లోని 104 చౌకదుకాణాలకు శాశ్వత డీలర్ల నియామక ప్రక్రియ చేపడుతున్నట్లు రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి ఆదివారం తెలిపారు. చిట్వేలి మండలం 1, నందలూరు 11, ఓబులవారిపల్లె 15, పెనగలూరు 06, పుల్లంపేట 07, రాజంపేట 21, రైల్వేకోడూరు 16, సుండుపల్లె 13, వీరబల్లి 14 చౌకదుకాణాలకు శాశ్వత డీలర్ల నియామక ప్రక్రియకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. 18 సంవత్సరాలు నిండి 40 సంవత్సరాలలోపు వయస్సు కలిగి, ఇంటర్‌మీడియట్ విద్యార్హత కలిగివుండాలన్నారు. అభ్యర్థులు సంబంధిత కార్యాలయాలలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. డిసెంబరు 15లోపు తమ దరఖాస్తులను తహసీల్దారు కార్యాలయాల్లో సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాల కోసం ఆయా తహసీల్దారు కార్యాలయాలను సంప్రదించాలని సబ్‌కలెక్టర్ కోరారు.

మైనార్టీల గణనను రద్దుచేయాలి

రాయచోటి అర్బన్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న మైనార్టీ పిల్లల గణనను వెంటనే రద్దుచేయాలని సీపీఎం అన్నమయ్య జిల్లా కమిటీ కార్యదర్శి పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో మతప్రాతిపదికన జరుగుతున్న చిన్నపిల్లల వివరాల సేకరణను వెంటనే ఆపేయాలన్నారు. 2014 నుంచి 2023 మధ్యకాలంలో పుట్టిన ముస్లిం, క్రిస్టియన్, మైనార్టీ వర్గాలకు చెందిన పిల్లల వివరాలు, వీరిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరినవారి నిష్పత్తిని సేకరించి 24గంటల్లో అందివ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఆదేశాలను తక్షణమే నిలిపివేయాలంటూ ఆయన డిమాండ్ చేశారు. కులగణన చేయాలంటూ అన్ని ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న డిమాండ్‌ను తిరస్కరించిన ప్రభుత్వం మరోవైపు గుట్టుచప్పుడు కాకుండా రాజ్యాంగ విరుద్ధమైన మతపరమైన వివరాలు సేకరించడం వెనుక ఉన్న ఎజెండా ఏమిటో వివరించాలంటూ కోరారు. ఎందుకోసం వివరాలు సేకరిస్తున్నారో చెప్పకుండా గుట్టుగా వివరాలు అందించాలనడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రభుత్వం తక్షణమే మతవివరాల సేకరణను నిలిపివేయాలంటూ తెలియజేశారు.

శాఖాహారంతో ఆరోగ్య సమస్యలు దూరం



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ ద్యాన మందిరం ప్రతినిధులు



ఆధ్యాత్మికోపన్యాసంలో పాల్గొన్న ప్రజలు

రాజంపేట టౌన్ : శాఖాహారంతో ఆరోగ్య సమస్యలు దూరం కాగలవని సంత్ సదానందగిరి స్వామి మహరాజ్ తెలిపారు. పట్టణంలోని సరస్వతి పిరమిడ్ ధ్యానమందిరం ఆరవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం మహాకరుణ శాఖాహార శాంతి ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సదానంద గిరిస్వామి మహరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం పిరమిడ్ ధ్యాన మందిరంలో పట్టణ ప్రజలనుద్దేశించి ఆధ్యాత్మికోపన్యాసం చేశారు. మనిషికి ఆరోగ్యానికి మించిన సంపద మరొకటి లేదన్నారు. ప్రతి ఒక్కరు మంచి ఆహారపు అలవాట్లను అలవరుచుకోవాలని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్యవంతులే నిజమైన సంపన్నులని తెలిపారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా వేళకు చక్కగా ఆహారం తీసుకుంటూ కంటినిండా నిద్రపట్టిన వారు అదృష్టవంతులని తెలిపారు. మనిషి ఆహారపు అలవాట్లతోపాటు ఆధ్యాత్మిక భావాలను అలవరుచుకోవాలని సూచించారు. ఆధ్యాత్మిక భావనలతోనే మనిషి సన్మార్గం వైపు పయనించగలడన్నారు. సమాజంలో శాంతికుసుమాలు విరాజిల్లాలంటే సన్మార్గంతోనే సాధ్యం కాగలదని తెలిపారు. ఇటీవల కాలంలో కొంతమంది విద్యార్థుల తీరు ఎంతో ఆందోళన కలిగిస్తోందన్నారు. దీనికి కారణం ప్రధానంగా తల్లిదండ్రుల పెంపకమే అని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలకు చిన్నప్పటి నుంచి మంచి సంస్కారం నేర్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పిల్లలకు సంస్కారం నేర్పించకుంటే సమాజంలో వారు ప్రమాదకరమైన వ్యక్తులుగా మారుతారని తెలిపారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి ప్రవర్తన నేర్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సరస్వతి పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ఉమ్మడి వైఎస్సార్ జిల్లా నాయకుడు సతీష్‌కుమార్, ప్రతినిధులు మదిపట్ల ఆంజనేయులు నాయుడు, రామచంద్రనాయుడు, నాగరాజ, పద్మావతమ్మ, నిర్మలమ్మ, సుబ్బరాయుడు స్వామి పాల్గొన్నారు.